క్లుప్తంగా

ఓంకారేశ్వరునికి నేడు లక్ష బిల్వార్చన


పూజలందుకుంటున్న ఓంకారేశ్వరుడు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లక్ష బిల్వార్చన చేయనున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ కార్తీక మాసం ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటలకు ఓంకారేశ్వరస్వామి శివలింగానికి లక్ష బిల్వార్చన చేస్తున్నామన్నారు. భక్తులు వీలైనన్ని బిల్వం, పూలను తీసుకురావాలని కోరారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


కమ్యూనిటీ భవనంలో కేక్ కట్ చేస్తున్న దివ్యాంగులు

కదిరి టౌన్: పట్టణంలోని దివ్యాంగుల కమ్యూనిటీ భవనంలో శ్రీఖాద్రీ దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యులు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఈనెల 10వ తేదీన స్థానిక కమ్యూనిటీ భవనంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు పెద్ద ఎత్తున దివ్యాంగులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కదిరి నియోజకవర్గ దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సభను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, గోపాల్, ఎల్లప్ప, గంగాధర్, లక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


బెల్టులు, ప్రశంసా పత్రాలు అందించిన ముఖ్య అతిథులు

ధర్మవరం: కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ చూపారని ఆర్ఎస్ఐ రాము, ధర్మవరం సైక్లింగ్, వాకర్స్ క్లబ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బాబా, కోశాధికారి ఓంప్రసాద్, సీనియర్ కరాటే మాస్టర్ అక్బర్ అలీ తెలిపారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం మల్టీస్టార్ ఆల్ ఇండియా బుడోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా సమక్షంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ చూపి ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, పర్పల్, బ్రౌన్ బెల్టులతోపాటు ప్రశంసాపత్రాలను ముఖ్య అతిథుల చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే విద్యార్థులు గీతావాణి, ఇర్షాద్, అబుబకర్ తదితరులు పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా విద్యుత్ స్తంభం


గుమ్మళ్లకుంట సమీపంలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

బత్తలపల్లి: గుమ్మళ్లకుంట గ్రామం మంచి నీటి స్కీం బోరు వద్దకు వెళ్లే విద్యుత్ స్తంభం ఒక పక్కకు ఒరిగి కూలడానికి సిద్ధంగా ఉంది. జాతీయ రహదారి పక్కనే స్తంభం ఉంది. గ్రామానికి చెందిన వరిమడుగు నారాయణ రెడ్డి పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్కీం బోరుకు హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభం ఒక వైపునకు ఒరిగిపోవడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


చౌటకుంటపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కురుమాల గ్రామ సచివాలయం పరిధిలోని చౌటకుంటపల్లిలో ఆదివారం ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గడప గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ కుటుంబాలకు వర్తించిన సంక్షేమ పథకాలు, వాటివల్ల చేకూరిన లబ్ధిని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు.

అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉండటంతో ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. జగనన్నతోనే రాష్ట్ర సంపూర్ణ అభివృద్ధి సాధ్యమన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వేల కోట్ల రూపాయలతో జాతీయ రహదారుల నిర్మాణం, 193 చెరువులను కృష్ణా జలాలతో నింపడం, 25 వేల పక్కాగృహాల నిర్మాణం తదితర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఇవన్నీ పూర్తవ్వాలంటే మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కోరారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మాటలు తప్ప ప్రజలకు చేసేందేమీ లేదన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

చౌటకుంటపల్లిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణాసంచా పేలుస్తూ దుశ్శాలువా, పూలమాలలతో ఎమ్మెల్యేను సత్కరించారు. మహిళలు హారతులు పడుతూ అడుగడుగునా ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను సావధానంగా వింటూ ముందుకు సాగారు. సర్పంచ్ లింగమూర్తి, ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ పెద్ద కేశవరెడ్డి, నాయకులు పీవీ భాస్కర్‌రెడ్డి, యనమల కేశవరెడ్డి, చెరువు రాజన్న, వై.మోహన్‌రెడ్డి, డీలర్ వనం శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, రాజారెడ్డి, శివారెడ్డి, లోకేశ్వరరెడ్డి, వనం గోపాల్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మాల్యవంతంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతం గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

నేడు 'స్పందన'

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని, మండలస్థాయిలో జరిగే కార్యక్రమానికి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే వినతి పత్రాలను అందజేయవచ్చని పేర్కొన్నారు.

తాడిమర్రి: తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండలంలోని 10 గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయాల సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని పూలతో అలంకరించారు. కర్ణాటక, ఉమ్మడి అనంతపురం జిల్లావాసులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆలయంలో ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

రాప్తాడులో వైఎస్సార్‌సీపీదే విజయం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

ఆత్మకూరు: రానున్న ఎన్నికల్లో రాప్తాడులో అఖండ మెజారిటీతో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. పరిటాల సునీత ఓ అబద్ధాల పుట్ట అని.. మోసపూరిత మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తారని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. దశాబ్దాలుగా ఉన్న నీటి సమస్యకు పరిష్కారం చూపామని తెలిపారు. పీఏబీఆర్ నుంచి పైప్‌లైన్ ద్వారా ఆత్మకూరు, అనంతపురం రూరల్‌కు నీరు ఇచ్చి ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. త్వరలోనే ఆత్మకూరులో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐక్యతతో హక్కుల సాధన


ఐక్యత చాటుతున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

పుట్టపర్తి టౌన్: ఐక్యతతో హక్కులు సాధించుకోవచ్చని బీసీ ఐక్యత వేదిక నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామంలో బీసీ ఐక్యతా రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీలంతా పార్టీలకు అతీతంగా ఐక్యతగా ఏకతాటిపై నడిచినప్పుడే హక్కులను సాధించుకోవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా మండలాలవారీగా పర్యటించి సమావేశాలు ఏర్పాటు చేసి జిల్లాలో బీసీ ఐక్యతా బహింగ సభలు నిర్వహించి చైతన్య పరుస్తామన్నారు. కార్యక్రమంలో కేసాని ఆదినారాయణ, శివానంద హరికృష్ణ, రాజశేఖర్‌యాదవ్, వెంకటరమణ, శివప్పా, సుధాకర్, ప్రసాద్, సేరేంద్ర, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బీజీ ఐక్యతా వేదిక జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా సమకోటి ఆదినారాయణ, అధ్యక్షుడిగా కొట్టాల శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా తిరుపతేంద్ర, ప్రధాన కార్యదర్శిగా పవన్‌కళ్యాణ్, రాజశేఖర్, కార్యదర్శిగా సుబ్రమణ్యం, కమిటీ మెంబర్‌గా కోనప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బస్సుయాత్ర విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామగిరి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేద్దామని ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ కత్రా హనుమంతరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. రాప్తాడు మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం సామాజిక సాధికార బస్సుయాత్ర జరుగుతుందని పేర్కొన్నారు. పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి, నసనకోట, మాదాపురం, రామగిరి, కుంటిమద్ది, పోలేపల్లి, గంతిమర్రి పంచాయతీలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

రాప్తాడు: మండల కేంద్రంలో సోమవారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల ఎన్నికల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతుందన్నారు. బడుగులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నామినేటెడ్ పదవులు ఇచ్చారని కొనియాడారు. కులమతాలు చూడకుండా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ సమన్యాయం పాటిస్తున్నారన్నారు. రాప్తాడులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రకు మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. బస్సు యాత్ర ముందే 2 గంటలకు బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. మండలంలో యువత రెండు గంటలకే రాప్తాడు చేరుకుంటే ర్యాలీ ప్రారంభిస్తామన్నారు. ర్యాలీ అనంతరం బస్సు యాత్ర స్థానిక బస్టాండు నుంచి డాన్ బోస్కో స్కూల్, ఆర్డీటీ కార్యాలయం, సిరికల్చర్ కార్యాలయం మీదుగా గంగలకుంట రోడ్డు నుంచి 44వ జాతీయ రహదారి మీదుగా వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకుంటుందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకుంటారన్నారు. సాయంత్రం 3 గంటలకు బహిరంగ సభ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే చంద్ర, జయన్న, కిరణ్ కుమార్, పుల్లలరేవు అంజి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన


తలుపుల పోలింగ్ స్టేషన్‌లో సూచనలిస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ

తలుపుల: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండల కేంద్రంతో పాటు, కుర్లి, ఓబులరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను ఆదివారం కదిరి ఆర్డీఓ వంశీకృష్ణ పరిశీలించారు. ఆయా పోలింగ్ స్టేషన్‌ల పరిధిలోని ఓటర్ల జాబితాపై ఆరా తీశారు. పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలు, సమస్యాత్మక గ్రామాలు, తదితర అంశాలపై రెవెన్యూ, బీఎల్‌ఓలతో చర్చించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈడీటీ ముకుంద, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్ఓ మోహన్, బీఎల్ఓలు ఘని, వకుల, రాధిక పాల్గొన్నారు.


బత్తలపల్లిలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ

గాండ్లపెంట: మండలంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను కదిరి ఆర్డీఓ ఎం.సస్నీవంశీకృష్ణ పలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి పరిశీలించారు. బూత్‌ల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. మండలంలోని మలమీదపల్లి, రెక్కమాను, బొలిగుట్లపల్లి, గాండ్లపెంట, కటారుపల్లి, ముద్దన్నగారిపల్లి పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదుకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. (ఫారం-6) కొత్త ఓటర్ల నమోదుకు 23, (ఫారం07) తొలగింపులకు 79 ,(ఫారం-8)కు 34 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ముకుంద పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోండి

బత్తలపల్లి: అర్హులైన వారందరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఓటరు నమోదు సూపర్‌వైజర్, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. ఆదివారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆయన మాల్యవంతం, యర్రాయపల్లి, బత్తలపల్లి గ్రామాల్లోని ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఫారం-6, 7, 8 దరఖాస్తులను భర్తీ చేసే విషయంలో ఖచ్చితమైన సమాచారాన్ని పొందుపర్చాలని బీఎల్‌ఓలకు సూచించారు. మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటున్నట్లు వివరించారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కింగ్స్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో కర్ణాటకనాగేపల్లి గ్రామంలో ఉన్న కింగ్స్ చర్చిలో పాస్టర్ అరుణ్ కుమార్, సాలోమియా ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 25 వరకూ జిల్లా వ్యాప్తంగా అన్ని చర్చిల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు కొనసాగుతాయన్నారు. పేదలకు వస్త్రాలు, ఆహార పదార్థాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ సురేష్ మాలాకి, అజయ్‌కుమార్, మాథ్యూస్, జానియన్ యేసురాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముబారక్

హిందూపురం అర్బన్: హిందూపురం రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం పట్టణానికి చెందిన ముబారక్ (26) అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రైలు కింద పడటంతో ముబారక్ తన రెండు కాళ్లను పోగొట్టుకున్నాడు. స్థానికులు 108కు సమాచారమిచ్చి ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా గురునానక్ జయంతి


అన్నదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం: ప్రపంచంలో మానవులందరూ ఒకే కుటుంబమని అందరూ సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని గురునానక్ చాటిచెప్పారని వక్తలు కొనియాడారు. గురునానక్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గాసర్కిల్ వద్ద సిఖ్ సత్ సంగత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపీపీ ఇందాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి, ప్రశాంతి మందిరం, వృద్ధాశ్రమం, ఈద్గా సర్కిల్ వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అన్ని మతాల పండుగలను సోదరభావంతో సామరస్యంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఖ్ సంగత్ మోహిందర్‌సింగ్, పలవీందర్‌సింగ్, భగవాన్‌సింగ్, జస్వంత్‌సింగ్, ఉమర్‌ఫరూక్, నాగరాజు, ఆంజనేయులు, ఉబేదుల్లా, షేక్షబ్బీర్, అజ్జు, అజమతుల్లా, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీఈఓ


పరీక్ష హాలును పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

పెనుకొండ రూరల్: పట్టణంలోని వివిధ కేంద్రాల్లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించారు. డీఈఓ మీనాక్షి ఆయా కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం నాలుగు సెంటర్లలో 1049 మంది విద్యార్థులకు గాను 1025 మంది పరీక్షకు హాజరయ్యారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు ప్రభుత్వం స్కాలర్‌షిప్ మంజూరు చేస్తుందని డీవైఈఓ రంగస్వామి తెలిపారు.

బస్సు - కారు ఢీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని యూ.రంగాపురం గ్రామం వద్ద ఆదివారం కేఎస్ఆర్టీసీ బస్సు ఇనోవా కారు ఢీ కొన్న ఘటనలో కారు, కేఎస్ఆర్టీసీ బస్సు దెబ్బతిన్నాయి. తుముకూరు నుంచి పావగడకు వస్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు... మడకశిర నుంచి వస్తున్న కారు యూ.రంగాపురం వద్ద ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

యూటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

హిందూపురం టౌన్: యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీను ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని సప్తగిరి కళాశాలల్లో యూటీఎఫ్ జిల్లా 2వ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జేవీవీ నాయకులు ఈటీ రామ్మూర్తి, రామకృష్ణ, రైతు సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, ఎన్‌జీఓ అధ్యక్షుడు నరసింహుడు, ఓపీడీఆర్ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, గౌరవాధ్యక్షుడిగా భూతన్న, సహాధ్యక్షుడిగా జీహెచ్ బాబు, సీతాలక్ష్మి, కోశాధికారిగా శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్‌గా మారుతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా మహంతేశ్వర్‌తో పాటు 8 మందిని జిల్లా కార్యదర్శులుగా నియమించారు. అనంతరం ప్రజా నాట్యమండలి కళాకారులు ఉద్యమ గీతాలు ఆలపించగా, యూటీఎఫ్ నాయకుడు నబీరసూల్ మ్యాజిక్ షో నిర్వహించారు.

సామాజిక సాధికార యాత్రకు తరలిరండి


అమరాపురం: మాట్లాడుతున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు అశోక్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: నియోజకవర్గ కేంద్రమైన మడకశిర పట్టణంలో ఈనెల 7వ తేదీన నిర్వహించే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు పోకుల అశోక్‌కుమార్, ఎమ్మెల్యే తిప్పేస్వామి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడకశిరలో 7న నిర్వహించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక సాధికార బస్సుయాత్రకు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. దీంతో ఐకమత్యంతో అందరూ యాత్రకు తరలిరావాలని పిలుపునిచ్చారు. పంచాయతీల వారీగా ఎంతమంది వస్తారు? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వాకర్క, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ నళిని, డైరెక్టర్లు లక్ష్మీదేవి, రాజేశ్వరి, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, వైస్.ఎంపీపీలు క్రిష్ణమూర్తి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి భక్తరహళ్లి బ్రహ్మోత్సవాలు

మడకశిర: మండలంలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మడకశిరలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు పోకుల అశోక్‌కుమార్‌తో కలిసి బ్రహ్మోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ఈనెల 24 నుంచి వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. భక్తుల కోసం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, పట్టణ అధ్యక్షుడు పుట్టకామప్ప, కౌన్సిలర్ అంజన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం

గోరంట్ల: మండల దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండలంలోని విభిన్న ప్రతిభవంతులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.